ముద్దా సురేష్

(పదిహేనవ భాగం)

వాన్ తలుపులు తెర్చుకుంటుండగా అక్కడికి చేరాడు రాణా.

శరీరమంతా కప్పివేస్తూ లోహపు దుస్తులు ధరించిన ఓ వ్యక్తి క్రిందకు దిగాడు చేతిలోని ప్రత్యేకమైన రైఫిల్‌తో.

ఆ రైఫిల్కి మూడంగుళాల పొడవైన ట్రిగ్గర్ ఉంది.

ఆ వ్యక్తి తలను కప్పేస్తూ హెల్మెట్—

కళ్ళముందు—హెల్మెట్‌ను కలుపుతూ మాస్కుకు ఫిట్ చేయబడ్డ అద్దం చూడ్డానికి వీలుగా.

ఆ వ్యక్తి వాన్ దిగి—బరువుగా తలతిప్పుతూ త్రుళ్ళిపడ్డాడు.

అతని చేతిలోని రైఫిల్ చటుక్కున పొజిషన్‌లోకి వచ్చింది. ట్రిగ్గర్ మీద నాలుగువేళ్ళు బిగుసుకున్నాయ్.

"కదలకు!"

"ఇట్సాలైరైట్ .... నేను రాణాని."

మరో బూడిదరంగు సూట్ ధరించిన ఆకారం వాన్ దిగుతూ పల్కింది. "యస్. కాప్టెన్! అతనే రాణా! రైఫిల్ దించండి!"

"సారీ సర్" రైఫిల్ వ్యక్తి అన్నాడు "దార్లో ఎదురైన కొన్ని సంఘటనలు చూసాక చీమచిటుక్కుమన్నా కంగారుపడక తప్పడంలేదు."

"ఇట్స్ ఓ. కే. ఆ సంగతి అర్థం చేసుకోగలను." రెండో ఆకారం కాప్టెన్‌ని తోసుకుంటూ రాణావైపు వచ్చింది.

"వెల్డన్ మిస్టర్ రాణా!" పల్కింది ఓ పరిచిత కంఠం హెల్మెట్ స్పీకర్‌లోంచి. "నీ ప్లాన్‌ని అమలు

పర్చడాన్కి మా రాక అలస్యం కాలేదని ఆశిస్తాను."

అతని హిందీ భాషలో దక్షిణాది యాసని గుర్తించాడు రాణా. "ప్రొఫెసర్ అశ్వత్థామ?" అడిగాడు.

"ఎస్" జవాబొచ్చింది. "మైక్రోప్లాస్మాని మనం కొండలో సీలు చేయకముందు దాన్నోసారి తాజాగా చూడాలని నిర్ణయించుకున్నాను. గుండెకాయలాంటి ఆ విషపదార్థాన్ని మనం ట్రాప్ చేయగలిగినప్పుడు మిగిలిన పాగమంచుని చెదరగొట్టడం అతి సులభం.

ఆ శాంపిల్‌ని మనం సేకరించిన తర్వాత అతి త్వరగా విరుగుడు ముందు కనుక్కోడాన్కి తప్పక వీలవుతుంది. తద్వారా వేలాదిమంది ఉన్మాదుల్ని కాపాడవొచ్చు. మనం దాన్ని భూగర్భ సమాధి చేయకముందు ఆ శాంపిల్‌ని గ్రహించాలి....ఎందుకంటే ఆ మైక్రోప్లాస్మాని ప్రొఫెసర్ విశ్వామిత్ర ఏ విధమైన విషపూరిత మార్పులు చేసాడో యిప్పటికీ నాకు తెలియదు." తను అప్పుడే దిగిన స్పెషల్ వాహనాన్ని చూపిస్తూ అన్నాడు అశ్వత్థామ "మనం వెంటనే ఆ టన్నెల్‌కు చేరుకోవాలి. మాట్లాడుతూ టైం వృధాచేసే అవకాశంలేదు."

రాణాని చేయిపట్టుకుని నడిపిస్తూ స్పెషల్ వాన్ వైపు తీసుకెళ్ళాడు అశ్వత్థామ. "ఇతను కాప్టెన్ నగర్వాలా. బాంబులు, డైనమైట్లు గురించి యితన్కి తెలియని విషయంలేదు. అవర్ కంట్రీస్ టాప్—ఎక్స్‌ప్లోజివ్స ఎక్స్‌పర్టు!"

అంటూ స్పెషల్ రైఫిల్ ధరించిన వ్యక్తిని రాణాకు పరిచయం చేసాడు అశ్వత్థామ.

"సర్! మీరు బేస్‌కి రిపోర్టు చేసినపుడు డోగ్రా విషయం ప్రస్తావించలేదు" అన్నాడు అనుమానంగా

నగర్వాలా.

రాణా దూరంగా రోడ్డు పైపడి వున్న రెండు ఆకారాల వైపు చేత్తో చూపించాడు.

"వారిలో ఒకడు డోగ్రా. వాన్ యాక్సిడెంట్ లో అతనికి తీవ్రమైన గాయాలు తగిలాయి. పిచ్చివాళ్ళ మధ్యకు నడిచాడు అలాగే. వాళ్ళు అతన్ని ప్రాణం పోయేవరకూ...."

నగర్వాలా లాలోపల తిట్టుకుంటూ వాన్ అధిరోహించాడు.

వాన్ లోపల లోహపు దుస్తులు ధరించిన, మరో వ్యక్తివైపు ఆశ్చర్యంగా చూసాడు రాణా.

"దిస్ ఈజ్ సుబేదార్ సైలో! ప్రేలుడు సామగ్రికి సంబంధించిన ఎస్సయిన్ మెంట్స్ తగిలితే నాకు అసిస్టెంట్ గా పనిచేస్తాడు. క్లెవర్ హెడ్" నగర్వాలా పరిచయం చేసాడు రాణాకి—అతని వెనకగా కూర్చుంటూ.

సైలో—హెల్మెట్ తల పంకించాడు.

"ప్రేలుడు పదార్థాలు తీసుకురావడాన్కి ఈ వాన్ లో చోటు సరిపోయిందా?" అడిగాడు రాణా.

చిన్న కాబిన్ లో ఆ నలుగురూ ఇరుగ్గా కూర్చున్నారు. రాణా తప్ప మిగతావారు లోహపు దుస్తులు ధరించడంవల్ల వాళ్ళ ఆకారాలు లావుగా అయ్యాయి.

"మేం తీసుకొచ్చిన క్వాంటిటీ సరిపోతుందని మా నమ్మకం సర్" చెప్పాడు సుబేదార్. "బ్లాసింగ్ జెలటిన్ తీసుకువచ్చాం. మీరు యిప్పుడు ఆ బాంబుల మీదే కూర్చున్నారు."

రాణా సీట్లో యిబ్బందిగా కదిలాడు.

"డోంట్ వర్రీ సర్!" నగర్వాలా అన్నాడు. "ప్రస్తు

తాన్కి అది ప్రమాదకరం కాదు."

"ఎవరైనా దాన్ని బలంగా కొట్టేవరకూ" పొడిగా అన్నాడు సుబేదార్ సైకో.

"ఎస్" ఒప్పుకున్నాడు కాప్టెన్. "ప్రస్తుతాన్కి రాణా డ్రైవ్ చేయడం మంచిదని నా సలహా. మనకంటే స్పష్టంగా ఆయన చూడగలుగుతారు. ఒకసారి తలుపు తీసాం కాబట్టి—మా హెల్మెట్స్ తీసి డ్రైవ్ చేయడం క్షేమం కాదు."

రాణా యిరుగ్గా కదిలి డ్రైవర్ సీట్లో కూర్చున్నాడు. సార్జంట్ అతను ఖాళీచేసిన వెనక సీట్లో చేరాడు.

అశ్వత్థామ అన్నాడు.

"మైక్రోప్లాస్మా ప్రభావాన్ని నిరోధించే శక్తి పూర్తిగా ఈ దుస్తులకుందో లేదో నేను చెప్పలేను. ముఖ్యంగా విషమేఘం మధ్య—శక్తివంతమైన మైక్రో ప్లాస్మా చేరువలో! అందుకే దాని శాంపిల్ని పరిగ్రహించాల్సిన వ్యక్తి నువ్వొక్కడివే మిస్టర్ రాణా!"

రాణా శరీరం ఒక్కసారి జలదరించింది.

"డోంట్ వర్రీ మై బాయ్" ధైర్యాన్నిస్తూ అన్నాడు అశ్వత్థామ. "మైక్రోప్లాస్మాకి మరీ దగ్గరగా నువ్వు వెళ్ళనక్కర లేదు. మనవద్ద చాలా పొడుగాటి మెటల్ ట్యూబ్ వుంది. నువ్వు చెయ్యవల్సిందల్లా గొట్టాన్ని మాక్లియస్ లోకి డైరక్టు చేయడమే. మాలో వొకరు నీతో సాధ్యమైనంత దగ్గరగా వస్తారు. నీకే హాని జరగకుండా వాచ్ చేయడాన్కి."

వాహనం కదిలింది....

రోడ్డుమీద కనబడుతున్న మృతదేహాల్ని తప్పిస్తూ ముందుకు పోనిచ్చాడు వాన్ని—రాణా. బొంబాయి

నగరమంతా మరుభూమిలా కన్పించసాగింది. అందరి మధ్యా నిశ్శబ్దం గూడు కట్టుకోవడంతో, ఆ స్తబ్ద వాతావరణం సహించలేక సంభాషణ ప్రారంభించాడు రాణా.

"ప్రొఫెసర్! మనం విరుగుడు మందు కనుక్కొనే టప్పటికి బొంబాయిలో కేవలం కొన్ని వేలమంది మాత్రమే మిగులుతారేమో? ఈలోగా ఉన్మాదులు వారిలోవారే హత్యలు.... మూకఉమ్మడి ఆత్మహత్యలు...."

"దాన్ని నివారించగలం రాణా!" అశ్వత్థామ అభయ హస్తం రాణా భుజంపై పడింది.

ఆశ్చర్యంగా అడిగాడు రాణా "ఎలా?"

"మొత్తం నగరమంతా మత్తుమందు జల్లబోతున్నాం. స్లీపింగ్ గాస్."

"వ్హాట్?! దట్స్ యింపాసిబుల్!"

"నో, ఇటీజ్ పాసిబుల్" శాంత గంభీరస్వరంతో అన్నాడు అశ్వత్థామ "'బొంబాయి'లో ఈ సంక్షోభం ప్రారంభమైనప్పటినుంచీ విమానాలు, హెలికాప్టర్లు రెండింటిని లోడ్ చేసుకుంటున్నాయ్. మొదటిది కాల్షియం క్లోరెడ్ రెండోది నైట్రస్ ఆక్సైడ్! ఈ గాస్ మనిషిని వెంటనే పడగొడుతుంది. ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం సిటీనంతటికీ నిద్రలోకి పంపడం.... నిద్రలో వుంచడం.... విరుగుడు మందు కనుక్కొనేంతవరకూ— ఈ విధంగా మనం లెక్కలేనంత మందిని కాపాడవొచ్చు. హత్యాకాండలనీ, ఆత్మహత్యాకాండలనీ సులభంగా ఆపవచ్చు."

రాణా ఉత్సాహంగా, స్పీడ్ పెంచాడు.

నిజమే. స్లీపింగ్ గాస్ ప్లాన్ బాగుంది. త్వరలో విరుగుడు మందు కనుక్కుంటే లక్షలమందిని కాపాడ

వచ్చు.

అందుకే తాము ఈసారి ఆ శాంపిల్ సేకరించడంలో ఖచ్చితంగా సఫలం కావాలి!

ఎన్ని కష్టాలు ఎదురైనాసరే!

మరో అయిదు నిముషాల్లో వారు—రెండు నల్లటి టన్నెల్ ముఖద్వారాల వద్దకి చేరారు.

సైన్యానికి సంబంధించిన యిద్దరు వ్యక్తులు ముందు దిగారు, అప్రమత్తతగా; చేతిలోని రైఫిల్స్ ఏ క్షణంలో నైనా ఉపయోగించడానికి సిదమౌతూ.

ప్రొఫెసర్ అశ్వత్థామ చివరిగా వాన్ దిగి అన్నాడు, "మనం ముందు న్యూక్లియస్ యింకా అక్కడే వున్నదాని నిర్ధారించుకోవాలి..." ఆగి ఆశ్చర్యంగా అన్నాడు "యిక్కడ రెండు టన్నెల్స్ ఉన్నాయే?"

రాణా తల పంకించాడు. "అవును. మొదటిది పాత టన్నెల్. కుడివైపు భూగర్భ మార్గం సరికొత్తది. ఉత్తరానికి వెళ్ళే ట్రాఫిక్ మొదటి మార్గంగుండా వెళ్తుంది. దక్షిణానికి వచ్చే ట్రాఫిక్ రెండో టన్నెల్ ఉపయోగిస్తుంది. విషమేఘం గుండెకాయ... న్యూక్లియస్ పాత టన్నెల్‌లో ఉంది." చేత్తో చూపించాడు రాణా "అది ఈపాటికి పారిపోకుండా యింకా అక్కడే ఉందని ఆశిద్దాం."

నలుగురూ ముఖద్వారంవేపు నడిచారు. రాణాకు తప్ప మిగతా ముగ్గురికీ—వెనుక ఆక్సిజన్ టాంకులు ఉన్నాయి.

"రాయి చాల గట్టిగా ఉంది!" వ్యాఖ్యానించాడు కాప్టెన్ నగర్వాలా ముఖద్వారం పైకప్పువేపు తలెత్తి చూస్తూ "రాతి గోడ స్ట్రాంగ్‌గా ఉంది. ముఖద్వారాన్ని

దృఢంగా కప్పేస్తుంది బ్లాస్టింగ్ తర్వాత."

"హే రామ్!" గాభరాగా అర్చాడు సుబేదార్ సైలో అక్కడో యువతి మొండెం నేలమీద పడి ఉంది!"

"దాన్ని గురించి మర్చిపో!" కఠినంగా అన్నాడు రాణా.

అతను ఏడు గజాలు లోపలికి నడిచేడు. అప్పుడు ఆగిపోయి నిలబడిపోయాడు కళ్ళు చీకటికి అలవాటు చేసూ.

"అది అక్కడే ఉంది" డిక్లేర్ చేసాడు కొంతసేపు తర్వాత రాణా.

యిద్దరు సైనికులు తిరిగి స్పెషల్ వాన్ వద్దకు నడిచారు.

వాన్ వెనుకభాగంలోంచి ట్రాలీలాంటి ఓ పరికరాన్ని క్రిందికి దింపారు.

ఆ సక్షన్ యంత్రం—రాణా మరాఠా కోటలో ఉపయోగించిన, దానిలాగే ఉంది. కాని యిది యింకా పెద్దది.

ఫైర్ సర్వీసెస్ ఉపయోగించే గొట్టంలాంటి—పొడుగాటి మెత్తటి స్టీల్‌తో చేయబడ్డ ట్యూబ్‌ని, మడతలు పెట్టి భుజానికి తగిలించుకొని సైలో—యంత్రాన్ని టన్నెల్ ముఖద్వారంవైపు నడిపిస్తున్న నగర్వాలాను అనుసరించాడు.

"మిస్టర్ రాణా! దీన్ని మీతో తీసుకెళ్ళండి" కాప్టెన్ అన్నాడు. ఓ చిన్న ఆక్సిజన్ టాంకుని రాణాకు అందిసూ, "యూ మే ఫైండ్ ఇట్ నెసెసరీ.... ఈ టార్చిలైట్ కూడా."

రాణా అతనికి థాంక్స్ చెప్పి చేతులు చాపి, టాంక్ బెల్టు తగిలించుకున్నాడు. టార్చి వెలిగించి, మరో చేత్తో ట్రాలీ యంత్రం మీద చేయివేసి అన్నాడు "అయామ్ రెడీ ప్రొఫెసర్!"

యిద్దరూ పల్లంగా వున్న టన్నెల్ లోపలి భాగంలోకి నడిచారు.

మొదటి మలుపు తిరగ్గానే అశ్వత్థామ హఠాత్తుగా ఆగిపోయాడు, మొదటిసారిగా ఆ 'వెలుగు' చూస్తూ.

"ఇన్నాళ్ళకి-దాన్ని స్పష్టంగా చూడగలుతున్నాను."

రాణా మాట్లాడలేదు.

ఒక్కో అడుగు ముందుకు వేసే కొద్దీ శరీరం వణుకు తోంది.

చెమటతో అతనికి వీపంతా తడిసిపోయింది.

యిద్దరూ ముందుకి నడిచారు.

"మీరిక్కడ ఆగిపోడం మంచిది ప్రొఫెసర్! కాంతి తీవ్రంగా ఉంది" అభ్యర్థించాడు రాణా.

"ఎస్ ... ఎస్ .... ఐ థింగ్ యు ఆర్ రైట్ .... ఈ మాస్క్ వల్ల నేను నీ అంత స్పష్టంగా చూడలేను. కాని మనం మైక్రోప్లాస్మా ప్రధాన భాగాన్ని చేరామను కుంటాను."

"లేదు ప్రొఫెసర్! అవతలి మలుపులో కాంతి యింకా దారుణంగా ఉంది. నేను ముందుకు వెళ్తున్నాను. మలుపులో సాధ్యమైనంత వరకూ మీకు కనపడేటట్లు నిలబడతాను" టన్నెల్ మేఘం దట్టంగానే ఉంది.

ముందుకి నడుస్తూ వంపును చేరుకున్నాడు రాణా, ఓసారి ప్రొఫెసర్ కోసం వెనక్కి తిరిగిచూస్తూ. ఆయనకు దూరంగా పోవడం అతనికి యిష్టంలేదు.

కాంతి జగజ్జేయమానంగా వెలుగుతూ కనబడింది రాణాకి.

బహుశా ఆ కాంతి కూడా దినదినం పెద్దది అవుతుందేమో.

తను మరాఠా దుర్గంలో చూసినపుడు ఆ వెలుగు అంత తీక్షణంగా లేదు.

త్వరత్వరగా లోహపు గొట్టాన్ని — యంత్రానికి అమర్చాడు రాణా.

తను సాధ్యమైనంత త్వరలో పని పూర్తి చేసుకుని బైటపడటం మంచిది.

గొట్టం చివరి భాగాన్ని న్యూక్లియస్ పదార్థంలోకి జొప్పించే ముందు—రాణా ఆక్సిజన్ సిలిండర్ కి వ్రేలాడుతున్న మౌత్ పీస్ ని నోటిముందు అమర్చుకున్నాడు—అక్కడి వాసన క్షణక్షణానికి భరించరానిదిగా మారుతుండడంవల్ల.

మెల్లగా మెత్తని స్టీలుగొట్టం మడతలు విప్పి నేల మీద పరిచాడు రాణా.

నేల చదునుగా వుంది.

రాణా గొట్టాన్ని ముందుకు త్రోయసాగాడు.

చివరికి—ట్యూబ్ ముందు భాగం ఆ వెలుగులోకి మాయమైంది, ఏ అడ్డూ లేకుండా....

అదే ఆశ్చర్యపరిచింది రాణాని.

న్యూక్లియస్ గట్టిగా వుండి, దేనినీ ప్రవేశించనీయడాన్కి వీలులేకుండా వుంటుందనుకున్నాడు.

కాని రాణాకి మళ్ళీ నిజం జ్ఞాపకం వచ్చింది. అది—అతి సూక్ష్మమైన లక్షలాది వ్యాధిక్రిముల సముదాయమని గుర్తు చేసుకున్నాడు.

స్టీల్ ట్యూబ్ మరింత ముందుకు తోసి — సక్షన్ యూనిట్ స్విచ్ నొక్కాడు రాణా.

బర్ బర్ మంటూ శబ్దం చేస్తూ పని చేయసాగింది సక్షన్ యంత్రం, అవతలి పదార్థాన్ని అతివేగంగా లోపలికి పీల్చేసుకుంటూ.

ఆ క్రియలో వంపులు తిరిగి వున్న గొట్టం, పైకీ కిందికీ కదిలి నిటారుగా బిగుసుకుంది.

యంత్రంలో ఉన్న కంటైనర్ నిండుకోడానికి మూడు నిముషాలు పడుతుందని అశ్వత్థామ అంతకుముందు రాణాకి చెప్పాడు. రాణా యంత్రాన్ని వదిలేసి, మోకాళ్ళమీద కూర్చున్నాడు ఆ విచిత్రమైన కాంతిని సూటిగా చూస్తూ.

అతను కూర్చుని తదేకంగా చూసిన ఆ మూడు నిముషాల్లో యింకా ముందుకు వెళ్ళాలన్న బలమైన కోరిక రాణాలో చాలాసార్లు కలిగింది.

చివరికి నిట్టూర్పు విడుస్తూ రాణా సక్షన్ యంత్రాన్ని ఆపేశాడు.

పదార్థం చేరుకున్న కంటైనర్ సీలు చేయబడడానికి మరో బటన్ నొక్కాడు.

తర్వాత ట్యూబ్ కనెక్షన్ లాగేసి నేలమీద వదిలేశాడు.

పైకిలేచి మరోసారి చూసాడు రాణా వెలుగువైపు.

బహుశా యింకా దగ్గిర్నుంచి చూస్తే మంచిదేమో? మైకో ప్లాస్మా నిర్మాణాన్ని సంబంధించిన ఆధారాలు తనకు దొరికితే అశ్వత్థామకు చెప్పొచ్చు.

ఆ విషయం-ఆయన విరుగుడు మందు పరిశోధనకెంతో ఉపయోగపడొచ్చు.

(ఇంకా వుంది)